# అధ్యాయం-4

## నియమాల పాటింపుపై ఆడిట్ పరిశీలనలు

పేజీలు 51 - 52

## మునిసిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ

### 4.1 సంగారెడ్డి పురపాలక సంఘంలో వసూళ్ళ దుర్వినియోగం

**ప్రభుత్వ నిబంధనలు పాటించకపోవటం, అంతర్గత నియంత్రణలు కొరవడటంవలన ₹84.67 లక్షల మేర వసూళ్లు దుర్వినియోగం అయేందుకు ఆస్కారం ఏర్పడటమేకాక ₹36.43 లక్షల మొత్తం తాత్కాలికంగా దుర్వినియోగం అయింది.**

ప్రభుత్వ ఉద్యోగులు వసూలు చేసిన మొత్తాలను, వారికి జమ చేసిన మొత్తాలను ఆలస్యం లేకుండా వెంటనే ప్రభుత్వ ఖాతాలో జమ చేయాలని ఆంధ్రప్రదేశ్ ఖజానా నియమావళిలో[1] స్పష్టం చేశారు. మునిసిపాలిటీ తరఫున చేసిన వసూళ్ళను ఆదే రోజునగానీ, మరుసటి రోజునగానీ బ్యాంకు లేదా ఖజానాకు పంపి మునిసిపాలిటీ సాధారణ నిధులకు జమ చేయాలని మునిసిపల్ మాన్యువల్‌లో కూడా సూచించారు. ఈవిధంగా వసూలు చేసిన మొత్తాలను కార్యాలయ అవసరాలకు వాడుకోవటంకానీ, ప్రభుత్వ పద్దులకు అవతల ఉంచటంకానీ చేయకూడదు. జీతాలకు, ఆఫీసు పరమైన చిన్నచిన్న ఖర్చులకు తప్ప మరే అవసరాలకూ మునిసిపల్ సాధారణ నిధులనుంచి సెల్ఫ్ చెక్కుల ద్వారా సొమ్ము డ్రా చేయకూడదు.

సంగారెడ్డి మునిసిపాలిటీలో రికార్డుల పరిశీలన చేసినప్పుడు (2013 జనవరి/అక్టోబరు) ఈ కింది విషయాలు తెలిశాయి :

i. పన్నులు, పన్నులుకాని ఇతర ఆదాయాల రూపేణా 2008-13 సంవత్సరాల మధ్య వచ్చిన రోజువారీ వసూళ్లు మొత్తం ₹2.39 కోట్లు 'సాధారణ నిధి'కి జమచేసే బదులు స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్‌లో చెల్లించారు (ఇందులో ₹1.97 కోట్ల మొత్తాన్ని సంగారెడ్డి మునిసిపాలిటీ కమీషనర్ సేవింగ్స్ ఖాతాలోనూ, ₹42.37 లక్షలను వివిధ పథకాలకు చెందిన ఖాతాలలోనూ వేశారు).

ii. రోజువారీ వసూళ్లకు సంబంధించిన చిట్టా రిజిస్టరు ప్రకారం ₹2.39 కోట్లు సేవింగ్స్ ఖాతాలో జమ చేసినట్లు కనిపిస్తున్నా, ఇందులో ₹36.43 లక్షల మొత్తాన్ని వాస్తవానికి ఏడాదిపైగా జాప్యంతో జమచేశారు. ఇది తాత్కాలికంగా నిధుల దుర్వినియోగాన్ని సూచిస్తుంది.

iii. ఇతర పథకాల పద్దులకు[2] జమ చేసినట్టుగా చిట్టా రిజిస్టరులో చూపుతున్న (2011 ఆగస్టు-2012 సెప్టెంబరు) ₹42.37 లక్షలకుగాను ₹1.88 లక్షల మొత్తాన్ని 2013 అక్టోబరు నాటికి జమచేయలేదు.

iv. వివిధ ఖర్చుల కోసం కమీషనరు 2009 - 2012 మధ్య సెల్ఫ్ చెక్కుల ద్వారా మొత్తం ₹82.79 లక్షలు ఎస్‌బీహెచ్ నుంచి డ్రాచేసారు. అయితే, ఇందుకు సంబంధించిన ఓచర్లను ఆడిట్ ముందుంచలేదు. కనుక ఈ ఖర్చుల యథార్థతను పరిశీలించటం వీలు కాలేదు.

ప్రభుత్వ నియమాలు పాటించకపోవటం, అంతర్గత నియంత్రణలు కొరవడటంవలన ₹84.67 లక్షలమేర[3] వసూళ్లు దుర్వినియోగం అయేందుకు ఆస్కారమేర్పడటమేకాక ₹36.43 లక్షల మొత్తం తాత్కాలికంగా దుర్వినియోగం అయింది.

---

[1] ఆంధ్రప్రదేశ్ ఖజానా నియమావళి మొదటి భాగంలోని 7వ నిబంధన

[2] వెనుకబడిన ప్రాంతాల గ్రాంటు నిధి, రాజీవ్ నగరబాట, పదమూడవ ఆర్థిక సంఘం

[3] ₹1.88 లక్షలు, ₹82.79 లక్షలు కలిపి

సంబంధిత మునిసిపల్ అధికారులపై తగు చర్యలు ఆరంభించవలసిందిగా మునిసిపల్ పరిపాలన కమీషనర్ మరియు డైరెక్టర్‌ను ఆదేశించామని ప్రభుత్వం బదులిచ్చింది (2014 మే). అదేవిధంగా సంగారెడ్డి మునిసిపాలిటీ పద్దులను 2008-13 సంవత్సరాలకు ప్రత్యేక తనిఖీ నిర్వహించమని రాష్ట్ర తనిఖీ శాఖ డైరెక్టరును కోరినట్టుకూడా తెలిపింది.

(వాణీ శ్రీరామ్)
ప్రధాన మహాగణకాధికారి (జీఎస్ఎస్ఏ)
ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ

హైదరాబాదు

ధృవీకరించడమైనది

(శశికాంత్ శర్మ)
భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్

కొత్త ఢిల్లీ